ప్రజాపక్షం

జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శనివారం | 23 , మార్చి 2024 | పేజీలు : 06



**భువనగిరి పార్లమెంట్ టికెట్ బీసీలకు ఇవ్వాలి** మెయిన్ లో...

# నరికేసేయ్.. ఏ చెట్టు అయినా ₹5 వందలే!

### చెప్పకనే చెబుతున్న అటవీశాఖ అధికారులు



**ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి ప్రతినిధి:** చెట్లను కొట్టివేసి కలపను సేకరించాలంటే అటవీ శాఖ అధికారుల అనుమతులు తప్పనిసరి అయినప్పటికీ అక్రమంగా చెట్ల నరికివేత మాత్రం ఆగడం లేదు. యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా అడ్డగోలుగా చెట్లను నరికి కలపని తరలిస్తుంటే మాకు మామూళ్ల అనుమతులు ఉన్నాయనే చందంగా అటవీశాఖ అధికారులు ప్రవర్తిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. 7కలప సేకరించేందుకు పొలాల్లో ఉండే భారీ వృక్షాలు,రోడ్ల వెంబడి పచ్చని చెట్లు,ఎక్కడ పడితే అక్కడ ఉన్న చెట్లను నరకడమే అక్రమార్కుల పనిగా తెలుస్తోంది. ప్రజలు ప్రశ్నిస్తే తమకు ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అనుమతి ఉందని ఒకటో రెండో చెట్లకు సంబంధించి ఆన్ లైన్ లో ఒక చెట్టుకు 500 రూపాయలు చెల్లించినట్లు చూపిస్తారు.కానీ పదుల సంఖ్యలో చెట్లను నరికి కలపను సాయంత్రం, రాత్రి వేళల్లో తరలిస్తారు.ఇదేమిటని అడిగే సంబంధిత శాఖల అధికారులు మౌనం వహించడం సాధారణం అయింది. వాస్తవానికి కలప సేకరించాలంటే అటవీశాఖ అధికారులు అనుమతులు తీసుకుని చెట్లు నరకాలి. కానీ గ్రామాల్లో ఇష్టారాజ్యంగా చెట్లు నరికి వాటి కలపను ఇటుక బట్టీలకు,పలు పరిశ్రమలలో బ్రాయిలర్ నిర్వహణ కొరకు తరలిస్తున్నారు. అటవీశాఖలో ఫారెస్ట్ రేంజర్,డిప్యుటీ ఫారెస్ట్ రేంజర్,సెక్షన్ ఆఫీసర్,బీట్ ఆఫీసర్,వాచర్లు విధుల నిర్వహణలో ఉన్నా అక్రమంగా కలప తరలుతూనే ఉంది.అసలు అటవీఅధికారులు ఇటుక బట్టీల వైపు ఎప్పుడైనా చూసారా .. తనిఖీ చేశారా అంటే అది కలలో కూడా జరగదు మరి.ఎందుకంటే అటవీశాఖ అధికారులు ఎంచక్కా ఆఫీసులో కూర్చుంటే ఎంత ముడుపులు చేరాలో అంత సంవత్సరం కాంట్రాక్టుగా బట్టీల నిర్వాహకులు ఆన్ లైన్ లేదా ఆఫ్ లైన్ లో ముట్టచెబుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు. అది నిజం కాకుంటే అధికారులు తనిఖీలు చేయడంలో నిర్లక్ష్యం వహించడం ఎందుకో పర్యావరణ హితులకు సమాదానం చెప్పాల్సిన అవసరం ఉంది.అక్రమ కలప సేకరణకు అడ్డుకట్ట వేయకపోవడానికి కారణమేమిటో చెప్పాలని వృక్ష ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట, తుర్కపల్లి, భువనగిరి, ఆలేరు, రాజాపేట మండలాల పరిధిలోని ఉన్న కొద్ఇపాటి అటవీ ప్రాంతాల నుండి,రైతుల భూములలో ఉన్న చెట్లను నరికి రాత్రివేళలో అక్రమంగా తరలిస్తున్నారని తెలుస్తోంది. చెట్లను మిషినరితో నరికే కూలీలు ఆయా ఏరియా లలో సుమారుగా పది మంది గ్రూపుగా ఉండి నిత్యం చెట్ల ను కొట్టడమే జీవనాధారం గా బతుకుతున్నట్లు వారంలో మూడు పర్యాయాలు రవాణా జరుగుతుందని పలువురు చెబుతుండటం గమనార్హం. ఇప్పటికైనా అక్రమంగా చెట్లను నరికే వారిపై అటవీశాఖ అధికారులు ఉక్కుపాదం మోపకపోతే పచ్చదనం అంతరించి పోయే పర్యావరణానికి పెను ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది.ఇప్పడికైనా అక్రమ కలప తరలింపు దారులపై ఉక్కుపాదం మోపి కఠిన చర్యలు తీసుకొని పర్యావరణాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.




### జిల్లా అటవీ అధికారి ఐ.పద్మజారాణి

జిల్లాలో ఎక్కడ కూడా నిబంధనలకు విరుద్ధంగా చెట్లను తొలగించ వద్దు.వృక్షాలను నరికితే కఠిన చర్యలు తీసుకుంటాం.అటవీ సంరక్షణ కొరకు కఠిన నిబంధనలు అమలులో ఉన్నాయి. ఎవరైనా సరే నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన కేసులు తప్పవు..తెలంగాణ ప్రభుత్వం పచ్చదనం పెంపొందించేందుకు హరితహారం ద్వారా మొక్కలను పెంచి పెద్ద వృక్షాలు అయ్యేలా చూస్తుంది. చెట్లను తొలగిస్తే పర్యావరణ సమతుల్యత దెబ్బతినే అవకాశం ఉంది.అక్రమంగా కలప రవాణా పై భారీ జరిమానాలు విధించాం.ఎవరైనా చెట్లను తొలగించాలంటే ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు లోబడి అనుమతులు తీసుకోవాలి.

# పల్లె ప్రజల పాటలే నా రచనలకు పునాది

### ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ



**ప్రజాపక్షం/సూర్యాపేటః** పాట రాయాలంటే కత్తుల వంతెన దాటాలని, కన్నీటి సంద్రం చూడాలని, పల్లెలో పనిచేసే వారు పాడుకున్న పాటనే నా రచనలకు పునాది అని ప్రముఖ సీని గేయ రచయిత,జాతీయ ఉత్తమ గేయరచయిత అవార్డు గ్రహీత సుద్దాల అశోక్ తేజ అన్నారు.ప్రపంచ కవిత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రాత్రి మనమ్ వికాసవేదికఅ అధ్యక్షుడు,సాహితి పిపాసి పెద్దిరెడ్డి గణేష్ ఆధ్వర్యంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, సుధాకర్ పివిసి ఎండి. మీలామహదేవ్ అధ్యక్షతన నిర్వహించిన అశోక్ తేజతో ఓ సాయంత్రం కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వచ్చేసి సాహితిప్రియులను సుద్దాల అశోక్‌తేజ ఓలలాడించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాటయోధుడు తన తండ్రి సుద్దాల హనుమంతుడిలోని డిఎన్ఏ, తల్లి జానకమ్మలోఎని జన్యువు తన పాటలకు ఆధారమని, నాలోని ప్రతిభ తన అమ్మనాన్నలకు చెందుతుందని ప్రకటించారు. కత్తిని కౌగిలించుకోవడమే కవిత్వమని, పాట రాయడం తెలిసిన వారికి చాలా సులువని, రాయడం తెలియని వారికి ఎన్నడు రాని విద్య అని వివరించారు. ప్రజా గళంలోనే కావ్య లక్షణం ఉంటుందన్నారు. ప్రతి పాటకు సిగ్నేచర్, అండర్‌లైన్ మెరుపులా ఆకట్టుకుంటుందని, మహాకవి కాళీదాస్ గురించి మల్లినాధుడు, చామకూర వెంకటస్వామి గురించి తాపీ ధర్మారావు, శ్రీశ్రీ మహాప్రస్థానంకు ముందు మాట చలం వివరించడం కవిత్వానికి ఉన్న గొప్పదనమన్నారు. తాను కవిగా,వక్తగా,రసజ్ఞుడుగా ముప్పేటగా ఉన్నానని, ఎక్కడ నెగ్గాలో, ఎక్కడ తగ్గాలో తెలిసినవాడే గొప్పవక్త అన్నారు. తన శ్రమకావ్యం, నేను అడవిని మాట్లాడుతున్నా శూద్రగంగావతరిణి ప్రత్యేక రచనలుగా నిలుస్తాయన్నారు. పాటను ద్వితీయ శ్రేణి కవిత్వంలాగా పరిగణిస్తున్నారని,నన్నయ్య,తిక్కన,యర్రప్రగడకు ఉన్న గౌరవం అన్నమయ్యకు లేదన్నారు. కవిత్వం పుట్టింది పాటతోనేనని పని పాట అన్నారు. కాని పని పద్యం, పనిశ్లోకం అనలేదన్నారు. పాటను కావ్యం లాగా రాయాలనే ఆలోచన ఉన్నదని, 18 పద్యాల విలువు, 18 కావ్యాల విలువ ఒకటి ఉండాలన్నదే తన సంకల్పమన్నారు. 1994లోనే నమస్తేతో మొదలైన తన పాటల ప్రస్థానంలో వజ్రాలు పొదిగిన వడ్డాణం తెచ్చి బుజ్జి నడుముకు పూజ చేసుకుంటా అని రాశానని గుర్తు చేశారు.పాటకు జాజ్వల్యమైన గ్లిటరింగ్, మెరుపు, ఉరుము లేనప్పుడు వాటిని మెదడులోనే చింపేస్తానని ఎర్రకవి, విప్లకవి అన్న గుర్తును చెరిపేసేలా ఎర్రకవికాదు, కుర్రకవి అని కూడా నిరూపించుకున్నానన్నారు. క్షణ క్షణం కవిత్వంతోనే కవిత్వం బతికి ఉంటుందన్నారు. నేనింకా రన్‌అవుట్ కాలేదని, అందుకు రజాకార్ సినిమాలోని పాటలే నిదర్శనమన్నారు. ఈ పాట ఫలానా సినారే, వేటూరి ఎందుకు రాయలేదనే నిరాశ పడేకన్నా తానే ఎందుకు రాయకూడదనే తపనతోనే తన పాటల ప్రయాణం మొదలైందన్నారు. ఇంత గొప్ప సాహితి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన దురంధరుడు పెద్దిరెడ్డి గణేష్, సహకరించిన సుధా బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్,ముఖ్య అతిదిగా విచ్చేసిన రచయిత సుద్దాల అశోక్ తేజ, ప్రధాన వక్తగా విచ్చేసిన కవి ప్రసేన్, ఆహుతులను, ఆహ్వానితులను, కవులను ఘనంగా సన్మానించారు.

# విద్యాశాఖ ఆదేశాలు బేఖాతర్

### రెండు పూటలా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలు
### మండు వేసవిలో విలవిలలాడుతున్న చిన్నారులు

**ప్రజాపక్షం/కోదాడః** ప్రతి ఏడాది మాదిరిగా ఈ ఏడాది కూడా వేసవిలో పిల్లలు ఇబ్బందులు పడవద్దు అనే ఉద్దేశంతో రాష్ట్ర విద్యాశాఖ ప్రభుత్వ, ప్రైవేట్ అన్ని యజమాన్యాల పాఠశాలలకు మార్చి 15 నుండి ఒంటిపూట బడులు నిర్వహించాలని ఉత్తర్వులు జారీచేసింది. కాగా ఈ ఉత్తర్వులను ప్రైవేట్ యజమాన్యాలు బేఖాతరు చేస్తూ రెండుపూటల బడులు నిర్వహిస్తున్నారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఐదున్నర వరకు చిన్నారులు పాఠశాలల్లో ఉక్కకు మాడిపోతున్నారు. పాఠశాలలు యధేచ్ఛగా ఇష్టారాజ్యంగా నిబంధనలు పాటించకుండా రెండు పూటలా పాఠశాలలు నిర్వహిస్తున్న విద్యాశాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. తల్లిదండ్రులు సైతం పిల్లలకు ఫీజులు కట్టారు అనే ఉద్ధేశంతో ప్రైవేట్ పాఠశాలలు రెండు పూటల నిర్విస్తున్న నోరు మెదపడటం లేదు. పిల్లలు ఒక పక్క వేసవి తీవ్రతకు ఇబ్బందులు పడుతున్న తల్లిదండ్రులు సైతం పట్టించుకోవడం లేదు. ఇంట్లో ఉంటే పిల్లలు అల్లరి చేస్తారని పాఠశాలల్లో తరగతి గదుల్లో బంధించి పెడితే ఏ ఇబ్బంది ఉండదని వారి ఉద్దేశంలో ఉన్నారు. కానీ మండు వేసవిలో విద్యార్థుల యొక్క ఇబ్బందులను పరిగణలోకి తీసుకునేనాథుడే లేకపోయాడు. కొన్ని పాఠశాలలు రేకుల షెడ్లలో సహితం నడుస్తున్నాయి. విద్యా హక్కు చట్టం ప్రకారం పిల్లలు ఇబ్బందులకు గురికాకుండా స్వేచ్ఛ వాతావరణంలో చదువుకోవాల్సి ఉండగా నిర్బంధ విధానాల మధ్య విద్యార్థులు చదువులు నేర్చుకునే దుస్థితి ఏర్పడింది.

ప్రచారాల జోరు.... విద్యాసంవత్సరం ముగియకముందే , పరీక్షలు పూర్తికాక ముందే కొన్ని ప్రైవేట్ పాఠశాలలు వచ్చే ఏడాదికి ప్రచారాలు మొదలుపెట్టాయి.కోదాడ పరిసర గ్రామాల్లో ఇంటింటికి తిరిగి విద్యార్థుల నమోదు చేపడుతున్నారు.బస్సుపాస్ ఫ్రీ అంటూ తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి , కార్పొరేట్ విద్య అంటూ బోల్తా కొట్టిస్తున్నారు. పది మందిని చేర్పిస్తేనే పాఠశాలలో ఉద్యోగం ఉంటుందని ప్రైవేట్ టీచర్లకు టార్గెట్లు పెట్టి మండువేసవిలో తిప్పుతున్నారు. ప్రైవేట్ యజమాన్యాల తీరుపై ప్రశ్నించేవారు లేకపోవడంతో ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి.

### కఠిన చర్యలు తీసుకుంటాం - విద్యాధికారి సలీం షరీఫ్

విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రైవేట్ పాఠశాలలు ఒంటిపూట బడులు నిర్వహించాలి.పట్టణంలోని కొన్ని పాఠశాలలు రెండు పూటలా తరగతులు నిర్వహిస్తున్నారని విషయం మా దృష్టికి వచ్చిందని వెంటనే ఆ పాఠశాలలపై చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ నిబంధనలు పాటించాలి లేని పక్షంలో చర్యలు తీసుకుంటాం.

## ఘనంగా శాలివాహన చక్రవర్తి జయంతి



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల కేంద్రంలో శుక్రవారం శాలివాహన చక్రవర్తి మహారాజ్ జయంతి వేడుకలను కుమ్మరి శాలివాహన సంఘం దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు తోటపల్లి కిరణ్, మండల కన్వీనర్ ఏరుకొండ రాము ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాలివాహన చక్రవర్తి మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నియోజకవర్గ అధ్యక్షుడు తోటపల్లి కిరణ్, వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేటి యువత శాలివాహన చక్రవర్తిని ఆదర్శంగా తీసుకొని రాజకీయంగా ఎదగాలని అన్నారు. కుమ్మరుల కోసం ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేసి పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కుమ్మరులకు కమిటి హాల్ నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈకార్యక్రమంలో తెలంగాణ కుమ్మరి సంఘం రాష్ట్ర యూత్ అధ్యక్షుడు ఎలిమినేటి సాయి, కుమ్మరి కుల సంఘం నాయకులు నీలకంఠం రాములు, బొడ్డుపల్లి మల్లయ్య, మాడ్గుల యాదగిరి, బొడ్డుపల్లి మల్లేష్, బొడ్డుపల్లి శంకర్, తోటపల్లి వెంకటయ్య, బొడ్డుపల్లి సైదులు, దశరథం, కళమ్మ, శంకర్, శ్రీను, రమేష్, నిరంజన్, ముత్యాలు, విజయ్, తిరపతయ్య, శ్రీను, బాలకృష్ణ, వెంకటేష్, యాదగిరి, నాని తదితరులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా హరికృష్ణ



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** రాష్ట్ర నీటిపారుదల,పౌరసరఫరాలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన ఆవుల హరికృష్ణను నియమిస్తూ శుక్రవారం హైదరాబాద్‌లో నియామక పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేస్తానన్నారు.తన నియామకానికి సహకరించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి,కాంగ్రెస్,యూత్ కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కుక్కడపు మహేష్ పాల్గొన్నారు.

## పార్లమెంట్ ఎన్నికల్లో అధిక మెజార్టీకి కృషి చేయాలి



**ప్రజాపక్షం/అనంతగిరి:** రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధిక మెజార్టీకి అన్ని గ్రామాల కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మస్కు శ్రీనివాసరెడ్డి కోరారు. రాష్ట్ర నీటిపారుదల పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల సన్నాహాక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వచ్చిన మెజార్టీ కంటే అధిక మెజార్టీకి కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి చుండూరు వెంకటేశ్వరరావు, జడ్‌పిటిసి ఉమా శ్రీనివాసరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గునుగుల గోపాల్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులు కొండపల్లి వాసు, బుర్ర పుల్లారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్లు బాబునాయక్, వెంకటరెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు డేగ కొండయ్య,ముత్తినేని కోటేశ్వరారవు, ప్రధానకార్యదర్శి జొన్నలగడ్డ వెంకటేశ్వరరావు, మాజీ పిఏసిఎస్ చైర్మన్ నర్సిరెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగుల్‌మీరా,గ్రామశాఖల అధ్యక్షులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.

# పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



**ప్రజాపక్షం /హాలియా:** తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయినందున వారిని రాష్ట్ర ప్రభుత్వం పక్షం ఆదుకోవాలని మాజీమంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. శుక్రవారం అనుముల మండలంలోని వివిధ గ్రామాలలో ఆయన ముమ్మరంగా పర్యటించి పంట నష్టపోయిన రైతులతో మాట్లాడి వారి బాధలు తెలుసుకున్నారు. పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని జగదీష్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన వెంట ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు రవీందర్ నాయక్, నోముల భగత్, రామచంద్రనాయక్ తదితరులున్నారు.

# కేజ్రీవాల్ అరెస్టు అప్రజాస్వామికం

**ప్రజాపక్షం/నల్లగొండ:** ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ని లిక్కర్ స్కామ్ అనే అవినీతి మరకను అంటిస్తూ అరెస్ట్ చేయ్యడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి యార శీను అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ దేశంలో మూడవ అతి పెద్ద రాజకీయ పార్టీగా అనతి కాలంలోనే ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాలలో అధికారంలోకి వచ్చి దేశవ్యాప్తంగా ఆమ్ ఆద్మీ పార్టీ విస్తరించడాన్ని జీర్ణించుకోలేని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈడీని ఉసిగొలిపి ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ నాయకత్వాన్ని అక్రమకేసులు అంట కట్టి అరెస్ట్ చేస్తున్నారన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీని భూస్థాపితం చెయ్యాలనుకుంటే



గోడకు కొట్టిన బంతి లాగా దేశవ్యాప్తంగా విస్తరిస్తామన్నారు. తక్షణమే ఆమ్ ఆద్మీ పార్టీ అరెస్ట్ చేసిన నాయకులను విడుదల చేయ్యాలని డిమాండ్ చేస్తున్నామని, కేజ్రీవాల్ అరెస్ట్ ప్రజాస్వామ్యానికి చెంపపెట్టులాంటిదని, ప్రతి ఒక్కరూ కేజ్రీవాల్ అరెస్టును ఖండించాలని కోరారు.

# రథోత్సవంలో పాల్గొన్న ఎంఎల్ఎ రాజగోపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/నాంపల్లి;** మండల పరిధిలోని తుంగపాడు గౌరారంలో శుక్రవారం శ్రీ చలిదోన లక్ష్మీ నర్సింహాస్వామి రథోత్సవ కార్యక్రమంలో భాగంగా మునుగోడు ఎంఎల్‌ఏ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం హడావిడిగా ప్రజల భూములను తక్కువ ధరకు తీసుకున్నందున, ప్రజలలో బాద, ఆవేదన ఉందని ఇప్పటికి కొంత మందికి ఆర్ అండ్ బి ప్యాకేజి రాలేదని, ఇండ్ల స్థలాలు పట్టాలు ఇవ్వలేదని అన్నారు. త్వరలోనే ఈ సమస్యలు పరిష్కారం చేస్తామని, లక్ష్మాణాపురం పర్యటక శాఖ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత కొండ వరకు రోడ్డు వేయించి కొండను మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఐదు సంవత్సరాలలో మునుగోడు నియోజకవర్గంలోని నాంపలి మండలాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తనదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి ఒక్క హామీని నేరవేరుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఏరెడ్ల రఘుపతిరెడ్డి, మాజీ ఎంపిపి పూల వెంకటయ్య, మండల వైస్ ఎంపిపి రజిని వెంకన్నగౌడ్, మండల పార్టీ అధ్యక్షులు కత్తి రవీందర్‌రెడ్డి, దేవాలయ ఈవో తదితరులు పాల్గొన్నారు.

## మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్ట్, రిమాండ్...



**ప్రజాపక్షం/దేవరకొండ;** ఇటీవల దేవరకొండ పట్టణంలో బస్ డిపో పక్క బిల్డింగ్‌పై మహిళను గొంతు కోసి హత్య చేసిన నిందితున్ని దేవరకొండ పోలీసులు అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు దేవరకొండ డిఎస్పి గిరిబాబు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డిఎస్పి మాట్లాడుతూ ఈనెల 14న డిండి మండలానికి చెందిన శ్రీలతను బెదిరించి, మధ్యం తాగి డబ్బుల విషయంలో గొడవ పడిన ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం సిద్దనపాలెం గ్రామానికి చెందిన బొమ్మనబోయిన సాంబయ్య శ్రీలతను హత్యచేసినట్లు తెలిపారు. మృతురాలి తమ్ముడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని నిందితున్ని పట్టుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో సిఐ నరసింహులు, ఎస్‌లు రమేష్, సైదులు ఉన్నారు.

## భూతవ్వకాలు జరిపితే చట్టపరమైన చర్యలు

**ప్రజాపక్షం/చింతలపాలెం:** మండలంలోని పులిచింతల ప్రాజెక్టుతో పాటు ప్రాజెక్టు పరిధిలోని వెల్లటూరు, తమ్మవరం గ్రామాల కృష్ణా పరివాహక ప్రాంతంలో ఆనధికారికంగా భూతవ్వకాలు జరిపినట్లు తమ దృష్టికి వచ్చిందని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షేక్ బేబి ఆసియా శుక్రవారం పేర్కొన్నారు. భూతవ్వకాలు జరపడం వలన కాండూర్ లైన్‌లో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున ముంపు గ్రామాల ప్రరజలు ఆనధికారికంగా తవ్వకాలు జరపకూడబదన్నారు.ఆనధికారికంగా త్రవ్వకాలు జరిపినచో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు

## కాంగ్రెస్ నాయకుడు మృతి

**ప్రజాపక్షం/మర్రిగూడ:** శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మర్రిగూడ మండలములోని సరంపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాజీ ఎంపీటీసీ సింగం గిరి యాదవ్ మృతి చెందడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు దిగ్భ్రాంతికి లోనయ్యారు. పార్టీకి ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మర్రిగూడ మాజీ ఎంపీటీసీ బాలయ్య, సత్తిరెడ్డి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎంఎల్ఎ సమక్షంలో పార్టీలో చేరిక



**ప్రజాపక్షం/ శాలిగౌరారం:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ యూనియన్ సంయుక్త కార్యదర్శి చామల వెంకట రమణారెడ్డి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చామల సంపత్ కుమార్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గూని వెంకటయ్య, ఓబీసీ కార్యదర్శి నిమ్మల కృష్ణమూర్తి గౌడ్ , లోడంగి మహేష్ , మొగుళ్ల శ్రీనివాస్, ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం చేసిన చైత్ర ఫౌండేషన్



**ప్రజాపక్షం/ శాలిగౌరారం :** శాలిగౌరారం గ్రామ పంచాయతీ పరిధిలోని బాలిశెట్టిగూడెం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం అయిన చిల్లంశెట్టి శోభ,శంకరయ్య కుమార్తె మహేశ్వరి వివాహానికి చైత్ర ఫౌండేషన్ చైర్మన్ యంగలి రామకృష్ణ గౌడ్ 20,116 రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్బంగా రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దారిద్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ఆర్థిక సాయంతో పాటు అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నమన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కందాల సమరం రెడ్డి , బండపెల్లి కొమురయ్య ,చింత ధనంజయ్,తోట్ల పుల్లయ్య, బొల్లికొండ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## కేజ్రివాల్ అరెస్ట్.. బిజెపి పిరికితనానికి నిదర్శనం

**ప్రజాపక్షం/ శాలి-గౌరారం:** ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయడం బిజెపి పిరికి తనాన్ని సూచిస్తుందని తెలంగాణ



ఆఫ్ రైతు సంఘం అధ్యక్షుడు యంపల్ల పురుషోత్తం రెడ్డి అన్నారు. ఇది బిజెపి పతనానికి నాంది అని, కేజ్రీవాల్ ను పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉంచే కుట్రలో భాగంగానే ఇలాంటి చర్యకు పాల్పడ్డారని విమర్శించారు. ఒక నిజాయితీ గల ముఖ్యమంత్రిని ఆధారాలులేని కేసులో అరెస్ట్ చేస్తూన్నారని, వేలకోట్ల కుంభకోణాలు చేసిన నాయకులు బిజేపి వైపు వస్తే వారిపై ఎలాంటి చర్యలు తీసుకొనకపోవడంలో ఉన్న మర్మమేందని ప్రశ్నించారు. మేధావులు, ప్రజాస్వామ్యవాదులు అరవింద్ కేజ్రీవాల్ అరెస్టును ఖండించాలని కోరారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



ప్రజాపక్షం/నడిగూడెం: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం ప్రకారం గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి అదనపు తూకం,తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న దళారుల నుండి రైతులను రక్షించాలని రైతు సంఘం సీనియర్ నాయకులు ఏనుగుల వీరాంజనేయులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.శుక్రవారం మండలంలోని రామాపురం గ్రామంలో ధాన్యపు రాశులను పరిశీలించి ఆయన మాట్లాడారు.క్వింటాల్‌కు రూ.500ల బోనస్ ఇవ్వాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో చిన్న కోటిరెడ్డి,పుల్లారెడ్డి, నర్సిరెడ్డి, సైదయ్య,భద్రయ్య,వెంకటరెడ్డి, లక్ష్మయ్య, భూషయ్య పాల్గొన్నారు.

## 25న తిరుపతమ్మవారి కల్యాణ మహోత్సవం



ప్రజాపక్షం/నేరేడుచర్ల: మండలంలోని దాచారం గ్రామంలో ఈ నెల 25న శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవార్ల కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.వేద పండితులు కొంకపాక రాధాకృష్ణ మూర్తి, ఆలయ అర్చకులు సురేష్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ఈ నెల 25 ఉదయం 5 గంటలు మంగళవాయిద్యం, సుప్రభాతసేవ, విఘ్నేశ్వర పూజ, పంచామృతాభిషేకాలు, నూతన పట్టువస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, శాంతికళ్యాణం, నీరాజన మంత్రపుష్పములు వంటి పూజా కార్యక్రమాలు, భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరగనున్నది.ఈ నెల 26న బోనాల సమర్పణకు ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కళ్యాణ మహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ వారు కోరారు.

## బిజెపి మండల ప్రధాన కార్యదర్శి నియామకం

ప్రజాపక్షం/మోటకొండూర్: భారతీయ జనతా పార్టీ మోటకొండూర్ మండల ప్రధాన కార్యదర్శిగా యెల్లంల శ్రీధర్ రెడ్డిని నియమిస్తూ మండల అధ్యక్షుడు తండ కృష్ణ గౌడ్ నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నాకు బాధ్యత అప్పచెప్పినటువంటి మండల అధ్యక్షులకు, నాయకులకు ధన్యవాదాలు తెలుపుతూ పార్టీ అప్పగించిన బాధ్యతలను తప్పకుండా పాటిస్తానని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు .ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పన్నాల చంద్రశేఖర్ రెడ్డి మండల మాజీ అధ్యక్షులు జోరుక ఎల్లేష్ నాయకులు పల్లా జితేందర్ రెడ్డి, గంగారపు నరేష్, దండు ఉపేందర్, తొడిగల సురేందర్ రెడ్డి, పాశం క్రిష్ణ రెడ్డి, సుల్తాన్ మహేందర్,మల్లం క్రిష్ణ, ఆలేటి నాగరాజు, భూమండ్ల సతీష్, శనిగరం ప్రదీప్, పూర్మ తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల రక్షణకు పటిష్టంగా పనిచేస్తున్నాం




ప్రజాపక్షం/గరిడేపల్లి: జిల్లా ఎస్‌పి రాహుల్ హెగ్డే ఆధ్వర్యంలో మహిళల రక్షణకై పటిష్టంగా పనిచేస్తున్నామని షీ టీమ్స్ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు.జిల్లా ఎస్పీ రాహుల్‌హెగ్డే ఆదేశాల మేరకు మండలంలోని గడ్డిపల్లి ఆదర్శ పాఠశాలలో జిల్లా షీ టీమ్స్, పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో మహిళల,విద్యార్థుల రక్షణ చట్టాలు,సోషల్ మీడియా,ఇంటర్నెట్ సద్వినియోగం,విద్యావిధానాలు అధిగమించడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు.ఈసందర్భంగా షీ టీమ్స్ ఎస్ఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు సమస్యలుంటే అధ్యాపకుల,అధికారుల దృష్టికి తీసుకరావాలన్నారు.మానసిక ధైర్యం కలిగి ఉండాని, అనుకూల,ప్రతికూల సమయాల్లో స్పందించేలా అవగాహన కలిగి ఉండాలని సూచించారు.తల్లిదండ్రుల కోరికలను,కలలను నెరవేర్చాల్సిన బాధ్యత మనపై ఉన్నదని గుర్తుచేశారు.సైబర్ మోసగాళ్ల వలన మోసాలకు గురికావద్దని,వ్యక్తిగత వివరాలు,బ్యాంకు ఖాతా, ఏటిఎం కార్డు వివరాలు,ఓటిపి వివరాలు,బ్యాంకుఖాతా వివరాలు ఇతరులకు చెప్పవద్దన్నారు.మెసెజ్‌లలో వచ్చే బ్లూ లింక్ అనుసరించి వ్యక్తిగత వివరాలు నమోదు చేయవద్దని, సైబర్ మోసాలపై 1930 ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు.వేధింపులపై 100కు సమాచారం ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు.గరిడేపల్లి ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడి అధిగమించి లక్ష్యాలను చేరుకుని లక్ష్యం కోసం కృషి చేయాలన్నారు.కార్యక్రమంలో ఆదర్శపాఠశాల ఇంచార్జి ప్రిన్సిపల్ భార్గవి, షీటీఎం హెడ్ కానిస్టేబుల్ జాఫర్, యల్లారెడ్డి, పోలీస్ బృందం సత్యనారాయణ, శ్రీనివాసరావు, భాస్కర్, కళాబృందం ఇంచార్జి యల్లయ్య, గోపి, చారి, క్రిష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కేజ్రీవాల్ అరెస్టును ఖండిస్తున్నాం



ప్రజాపక్షం/తిరుమలగిరి: 2021/2022వ సంవత్సరంలో ఢిల్లీ ప్రభుత్వం ఎక్సైజ్ పాలసిని రూపొందించడంలో, అమలు చేయడంలో అవినీతి,మనీలాండరింగ్ ఆరోపణలపై ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడి) అరెస్టు చేయడాన్ని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దుంపల మురళీధర్‌రెడ్డి ఖండించారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోనే ఒక సిఎంను కోర్టులో ఛార్జీషీట్ కూడా సమర్పించకుండా అరెస్టు చేయడం ఇదే తొలిసారన్నారు. కేజ్రీవాల్ అరెస్టు, ఇతర ప్రతిపక్ష నాయకులైన బిఆర్ఎస్ నాయకులు కవితను అరెస్టు చేసి ఆకస్మిక దాడులు, అక్రమ నిర్బంధాలన్నింటిని అన్ని ప్రజాస్వామ్యశక్తులు గట్టిగా ఖండించాల్సిన సమయం ఆసన్నమైందని, సార్వత్రిక ఎన్నికల్లో బిజెపికి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. అక్రమ దాడులకు వ్యతిరేకంగా అన్ని ప్రతిపక్ష పార్టీలతో ఆందోళన చేస్తామన్నారు. విలేకుల సమావేశంలో ఆమ్ ఆద్మీ నాయకులు దుంపల పారిజాత, సాలయ్య, వై.సోమలక్ష్మీ, యాకూబ్‌రెడ్డి, నరసింహాచారి, సావిత్రమ్మ, సందీప్,నరేష్ పాల్గొన్నారు.

## బిసి ఓవర్సీస్ స్కాలర్‌షిప్స్ సంఖ్యను పెంచాలి

ప్రజాపక్షం / మిర్యాలగూడ: బీసీ ఓవర్సీస్ స్కాలర్‌షిప్స్ సంఖ్యను 300 నుంచి 2వేల మందికి పెంచాలని బీసీ సంక్షేమశాఖ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం సచివాలయంలో బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశంను కలిసి వినతిపత్రం అందేచేసి మాట్లాడారు. బీసీ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ మంజూరై విదేశాల్లో ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులకు వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న నిధుల విడుదల జాప్యం వల్ల స్వదేశంలో ఉన్న తల్లిదండ్రులు, విదేశాల్లో ఉన్న విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బీసీ జనాభా తగట్టు విదేశీ విద్య స్కాలర్‌షిప్స్ సంఖ్యను 300 నుంచి 2వేలకు పెంచాలని కోరారు. ఆయన వెంట తాడికొండ విక్రమ్, ఇంద్రం పాల్గొన్నారు.

## నూతన కమిటీ నియామక పత్రాలు అందచేత



ప్రజాపక్షం/తుర్కపల్లి: మండల కేంద్రంలోని బీజేపి పార్టీ కార్యాలయంలో శుక్రవారం మండల అధ్యక్షులు బానోత్ శత్రు నాయక్ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు నియమాక పత్రాలు అందచేశారు. మండల ప్రధాన కార్యదర్శులుగా జక్కుల వెంకటేష్ యాదవ్, ఏదుముల ఆంజనేయులును, ఉపాధ్యక్షులుగా బినారపు కనకయ్య, మండల కార్యదర్శిగా ఆకుల శ్రీను, నియమించారు. ఎస్టీ మోర్చా అధ్యక్షులుగా వాంకుడోతు రాము నాయక్, ఎస్సీ మోర్చా అధ్యక్షులుగా బర్ల లచ్చయ్య, మైనార్టీ మోర్చా అధ్యక్షులుగా సయ్యద్ హైమద్‌లను నియమించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు కొక్కొండ లక్ష్మీనారాయణ, మాజీప్రధాన కార్యదర్శి మేకల శ్రీనివాస్, పడాల శ్రీనివాస్ పటేల్, సీనియర్ నాయకులు కందుకూరి చెలమయ్య, బిజెవైయం జిల్లా కార్యదర్శి మేకల పాండుయాదవ్, గిరిజన మోర్చ జిల్లా కార్యదర్శి వాంకుడోత్ సాయి, బినారపు నర్సింలు, ఆకుల భాను, కందుకూరి వేణు, హీరేకర్ శ్రీనివాస్,తదితర నాయకులు పాల్గొన్నారు.

## లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ నీటి దినోత్సవం



ప్రజాపక్షం/నేరేడుచర్ల: నేరేడుచర్ల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని చింతకుంట్ల ప్రాథమిక పాఠశాలలో పాఠశాల హెచ్ఎం కె. నాగార్జునరెడ్డి అధ్యక్షతన ప్రపంచనీటి దినోత్సవం సందర్భంగా నీటి వినియోగం,నీటి ఆవశ్యకత వంటి అంశాలపై డ్రాయింగ్,వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగింది.పోటీలలో ప్రతిభ కనబర్చిన విజేతలకు క్లబ్ అధ్యక్షులు చల్లా ప్రభాకర్‌రెడ్డి బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నీటి ప్రాముఖ్యత, వినియోగం, వివిధ పట్టణాల్లో త్రాగు నీటి కొరత వంటి విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి జిలకర రామస్వామి, క్లబ్ ఉపాధ్యక్షుడు కర్రి సూర్యనారాయణరెడ్డి,సభ్యులు మాతంగి సైదులు,ఉపాధ్యాయులు షేక్ షఫీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## రెండు లక్షల రుణమాఫీ చేయాలి



ప్రజాపక్షం/గరిడేపల్లి: అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు హామీ ఇచ్చిన రెండు లక్షల రుణమాఫీని వెంటనే అమలు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి షేక్ యాకూబ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శుక్రవారం మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో సిపిఎం జనరల్ బాడీ సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకిచ్చిన రెండు లక్షల రుణమాఫీ మాటను నిలబెట్టుకోవాలన్నారు.రైతాంగం పండించిన వరిపంటకు మద్దతు ఇవ్వాలని కోరారు.క్వింటాకు రూ.2500 చొప్పున ఇచ్చి మిల్లర్లు రైతులను ఇబ్బంది పెట్టకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.వరి పంటలు నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం ఇవ్వాలన్నారు.కార్యక్రమంలో బొల్లేపల్లి శ్రీనివాస్,జుట్టుకొండ వెంకటేశ్వర్లు, యల్లావుల నారాయణ,మాజీ సర్పంచ్ రామస్వామి,దోసపాటి భిక్షం, బొమ్మకంటి అంజయ్య, తుమ్మల సైదయ్య పాల్గొన్నారు.

## గోమాతకు ప్రత్యేక పూజలు



ప్రజాపక్షం/హుజూర్‌నగర్‌రూరల్: మండలంలోని బూరుగడ్డ గ్రామంలో వేంచేసియున్న శ్రీఆదివరాహ లక్ష్మీ నృసింహ వేణుగోపాల స్వామి ఆలయంలో శుక్రవారం గోమాతకు గోపూజా కార్యక్రమంలో భాగంగా ఆలయ అర్చకులు హరీష్‌కుమారచార్యులు,మనోహర చార్యులు ప్రత్యేక పూజలను నిర్వహించారు.అదే విధంగా ఆలయంలో శ్రీ గోదా వేణుగోపాల భజన మండలి వారిచే అంగరంగ వైభవంగా భజన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.కార్యక్రమంలో ఆలయ ఈవో ఎమ్.పి లక్ష్మణ్‌రావు,కొత్త ప్రవీణ్ కుమార్ గుప్తా, యరగాని వెంకటేశ్వర్లు, యరగాని గోపాలం, మాద్దుల లింగయ్య, యలమంచమ్మ,భాగ్యలక్ష్మీ ,నాగమణి,లక్ష్మీ ,ఆలయ సిబ్బంది గోవిందరెడ్డి, కిరణ్‌గౌడ్,రమేష్,ఉపేందర్,భక్తులు పాల్గొన్నారు.

# బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నియామకం



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్:** భారతీయ జనతా యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా బూర్గు మణికంఠ గౌడ్ నియామకం అయ్యారు. నాపై నమ్మకం ఉంచి భారతీయ జనతా యువమోర్చా యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నా నియామకానికి సహకరించిన భారతీయ జనతా పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు పట్నం కపిల్, జిల్లా ప్రధాన కార్యదర్శులు అశోక్, ఎన్నం శివ, భువనగిరి మండల అధ్యక్షులు చిర్క సురేష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను గౌరవిస్తూ, నియమ నిబంధనలు పాటిస్తూ, పార్టీ ఎదుగుదలకు నావంతు కృషి చేస్తానని తెలిపారు. గతంలో బూతు స్థాయి అధ్యక్షుడు కార్యదర్శి నుంచి యువమోర్చా మండల అధ్యక్షులు జిల్లా కార్యవర్గ సభ్యులుగా బాధ్యతలు నిర్వహించినట్లు చెప్పారు.

# కబ్జా అయన కబరస్థాన్ దారి



**ప్రజాపక్షం/మర్రిగూడ :** ముస్లిం మైనార్టీ వారి కబరస్తాన్ దారి మూసివేసినందున శుక్రవారం స్థానిక శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మర్రిగూడకు వచ్చిన సందర్భంగా ముస్లిం పెద్దలు కబరస్తాన్ దారి గురించి చర్చించటంతో వెంటనే ఎమ్మెల్యే స్పందించి ఆర్డిఓ, తాసిల్దార్ తో మాట్లాడి తక్షణమే దారి చూపించుటకు ఆదేశాలు జారి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు ఎండి యాకూబ్ ఎండి అశ్వక్. ఎండి జబ్బర్, షర్ఫుద్దీన్, ముస్లిం పెద్దలు మాజీ సర్పంచ్ మాస నీలిమ చంద్రశేఖర్ ఉన్నారు.

# వయోజనులు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలి

**ప్రజాపక్షం /నార్కట్ పల్లి :** ఓటు హక్కు అర్హతలు ఉన్న ప్రతి ఓటర్ ఏప్రిల్ 1 వరకు దరఖాస్తులు చేసుకొవాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొమ్ము యాదయ్య మహరాజ్ ఒక ప్రకటనలో ఓటర్లను కోరారు. ఏప్రిల్ 18 సంవత్సరాలు వయస్సు గల ఓటర్లు ఈ అవకాశాని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# మెగా రక్తదాన శిబిరం



**ప్రజాపక్షం/మోత్కూర్:** మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలో హీరో లక్ష్మీ మోటార్స్ వారి 15వ వార్షికోత్సవ సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. మెగా రక్తదాన శిబిరంలో సిబ్బంది, హీరో కస్టమర్లు, రక్తదానం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీ మోటార్స్ మెట్టు మంగేష్ మాట్లాడుతూ అత్యవసర సమయాలలో చాలామంది రక్తం అందక ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని, ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని అన్నారు. యువకులు ముందుండి ఇలాంటి కార్యక్రమాలు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ మండల చైర్మన్ ఓ.సత్యనాథ్, జిల్లా డైరెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ సిహెచ్ అనిల్, పి.ప్రవీణ్ కుమార్, బుస్స రవి, సభ్యులు పి.చంద్ర రెడ్డి, సుబ్రమణ్య శర్మ, పి.మచ్చేందర్, జి.ప్రసాద్ పాల్గొన్నారు.

# గాలికుంటు నివారణకు ఉచిత టీకాలు



**ప్రజాపక్షం/ఆలేరు:** పశువులలో వచ్చే గాలి కుంటు వ్యాధి అరికట్టడానికి ముందస్తుగా వేస్తున్న ఉచిత నివారణ టీకాలు పాడిరైతులు వినియోగించుకోవాలని జిల్లా పశు వైద్య మరియు పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సదానందం అన్నారు. ఆలేరు మండలం మంతపురి గ్రామంలో ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆలేరు పశు వైద్యాధికారి డాక్టర్ చైతన్యతో కలిసి ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సంధర్భంగా 250కి పైగా పశువులకు టీకాలు వేసిన అనంతరం ఆయన మాట్లాడారు. వైరస్ వల్ల పశువులలో గాలి కుంటు వ్యాధి ప్రబలకుండా ముందు జాగ్రత్తగా టీకాలు వేస్తున్నామని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆలేరు పశు వైద్యాధికారి డాక్టర్ చైతన్య మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి రాకుండా ముందస్తుగా అరికట్టడానికి ఉచితంగా టీకాలను వేస్తున్నామని మంతపురి లో ఇప్పటికీ 250 కి పైగా పశువులకు వేసామని చెప్పారు. ఆలేరు మండల వ్యాప్తంగా ఉన్న అన్ని పశువులకు టీకాలు వేయడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని చెప్పారు. గాలికుంటు వ్యాధి సోకిన ఆవులు,గేదెలు నోట సొల్లు కారి అంటు వ్యాధి లా మారుతుందని చెప్పారు. వ్యాధి సోకితే అధిక జ్వరం కలిగి నోటి లోపల,కాలి గిట్టల మధ్యన పుండ్లు అవుతాయని అన్నారు.నోటిలో పుండ్ల వలన మేత మేయకపోవడంతో పాల దిగుబడి తగ్గి పాడి రైతులు నష్టపోతారని వివరించారు. అందువలన గాలి కుంటు వ్యాధి రాకుండా ప్రభుత్వం ముందస్తుగా వేస్తున్న వ్యాధి నిరోధక టీకాలను రైతులు అందరూ వారి పశువులకు వేయించాలని కోరారు. ఈ టీకాల కార్యక్రమం లో పశు వైద్యులు డాక్టర్ నవీన్ రెడ్డి, సిబ్బంది స్వామి, రమ, శ్రవణ్, సుధాకర్, గోపిలతో పాటుగా రైతులు ఆంజనేయులు, భాస్కర్ రెడ్డి, సిద్దులు, మహేందర్ ఉన్నారు.

# అఖిలపక్ష నాయకులపై అక్రమ కేసు కొట్టివేత



**ప్రజాపక్షం/మోటకొండూర్:** వంగపల్లి హైవే వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించి ప్రమాదాలను నివారించాలని కోరుతూ మోటకొండూరు మండల అఖిల పక్ష నాయకులు ప్రజలు వంగపల్లి వద్ద గతంలో రాస్తారోకో కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా ప్రయాణికులకు ఇబ్బంది జరగకున్నా ప్రయాణికులకు ఇబ్బంది కలిగించినారు అనే నెపంతో మోటకొండూరు మండల అఖిలపక్ష నాయకులు 11 మందిపై యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్ లో అక్రమ కేసు పెట్టడం జరిగింది. అట్టి కేసు సుమారు 7 సంవత్సరాలు విచారణ జరిగి శుక్రవారం జూనియర్ సివిల్ జడ్జి కం జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు ఆలేరు అఖిలపక్ష నాయకులపై పెట్టిన కేసులో సరైన సాక్షాదారాలు లేనందున కేసు కొట్టివేస్తున్నామని చెప్పడంతో అఖిల పక్ష నాయకులు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అఖిల పక్ష నాయకులు ప్రజల కోసం ప్రజా సమస్య పరిష్కరించాలని కోరుతూ చేసిన కార్యక్రమాన్ని అర్థం చేసుకొని కేసు కొట్టివేసిన సివిల్ జడ్జికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు బోలగాని సత్యనారాయణ, బోలగాని జయరాములు,పీసరి తిర్మల్ రెడ్డి, వంగపల్లి మహేందర్, బోట్ల నరసింహ, భూమండ్ల శ్రీనివాస్, వంగపల్లి ఉప్పలయ్య,పన్నాల చంద్రశేఖర్ రెడ్డి, బొబ్బల పాండురంగారెడ్డి ,భరత్ చంద్ర,నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

# బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సత్యనారాయణ



**ప్రజాపక్షం/తుంగుతుర్తి:** తుంగతుర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన న్యాయవాది తాళ్లపల్లి సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఈ నెల 20న న్యాయవాదుల సర్వసభ్య సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నకున్నారు.బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా రమావత్ పూల్‌సింగ్‌నాయక్, జనరల్ సెక్రటరీగా ఎం.డి పర్వీన్, జాయింట్ సెక్రటరీగా మల్లెపాక రవికుమార్, కోశాధికారిగా ప్రతాప్‌లు ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం కోర్టులో జడ్జి లేక అందరూ ఇబ్బందులు పడుతున్నారని న్యాయవాదుల సహకారంతో ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకవెళ్లి జడ్జిని నియమించేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు.అదే విధంగా కోర్టు భవననిర్మాణం కోసం తాను శాయశక్తుల కృషిచేస్తానన్నారు.

# ఖాతాలను స్తంభింప చేయడం పిరికిపంద చర్య



**ప్రజాపక్షం/మోత్కూర్:** కాంగ్రెస్ పార్టీ ఖాతాలను బిజెపి స్తంభింపజేయడం పిరికిపంద చర్య అని యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మందుల సురేష్ అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ చేస్తున్న న్యాయి యాత్ర ద్వారా వస్తున్న ఆదరణ చూసి, ఓర్చుకోలేక నరేంద్ర మోడీ, అమిత్ షా నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ ఖాతాలను స్తంభింపజేయడం వల్ల కాంగ్రెస్ పార్టీ గెలుపును అడ్డుకోలేరని అన్నారు. రానున్న ఎన్నికల్లో కేంద్రంలో కచ్చితంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని అన్నారు. దేశంలో ప్రతి ఒక్కరు రాహుల్ గాంధీ ని ప్రధానమంత్రిని చేయాలని కోరుకుంటున్నారని, బిజెపి ప్రభుత్వం కార్పొరేటర్లకు తొత్తులుగా వ్యవహరిస్తుందన్నారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతాలను అడ్డుకున్నారని ఆరోపించారు.

# బ్రహ్మోత్సవాల కరపత్రం ఆవిష్కరణ



**ప్రజాపక్షం/మోత్కూర్:** మోత్కూర్ మున్సిపాలిటీలో కొలువైన శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల కరపత్రాలను మున్సిపాలిటీ చైర్మన్ గుర్రం కవిత లక్ష్మీ నరసింహారెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 24 నుండి శ్రీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవలు ఘనంగా జరుగుతాయని అన్నారు. ఆదివారం రాత్రి తెల్లవారు జామున తెల్లారితే (సోమవారం) స్వామి వారి కళ్యాణంతో మొదలై, ఏప్రిల్ 1 తేదీన దోపోత్సవంతో ముగుస్తాయని తెలిపారు. ఈ బ్రహ్మోత్సవ కార్యక్రమాలల్లో శ్రీ రామలంగేశ్వర స్వామి భక్తులు, మోత్కూరు పట్టణ ప్రజలు, అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఆలయ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, ఆలయ కమిటీ చైర్మన్ గుండగోని రామ చంద్రు గౌడ్, సభ్యులు బుర్ర యాదయ్య, ఉయ్యాల అంజయ్య, బొల్లేపల్లి సీతయ్య, బీసు యాదగిరి, మొరిగాల రాజయ్య, పన్నాల శ్రీనివాస్ రెడ్డి, రంగయ్య పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తో ఎలాంటి సంబంధం లేదు

**ప్రజాపక్షం/వలిగొండ :** పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతూ ఇతర పార్టీలతో అంట కాగుతున్న వలిగొండ మండల పరిధిలోని దుపెల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బీసు వెంకటయ్యకు కాంగ్రెస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయనను పార్టీ నుండి బహిష్కరించినట్లు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలియజేశారు. గ్రామంలో నిర్వహించే పార్టీ కార్యక్రమాలను, అధికారిక పార్టీ కార్యక్రమాలను పార్టీ నాయకులతో సంబంధం లేకుండా నిర్వహిస్తూ పార్టీ నష్టానికి పాల్పడుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాగగోని శోభారాణి వెంకటయ్య, బందెల స్వామి దాస్, మారోజు సత్యనారాయణ చారి, చంద్రయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు బొమ్మగాని మారయ్య, నవీన్ రెడ్డి, యాదయ్య, వల్లపు శ్రీనివాస్ యాదవ్, కన్నెబోయిన శంకరయ్య యాదవ్, బాలగోని మల్లయ్య గౌడ్, బాసవాడ బిక్షపతి, పుల్లగుర్ల మల్లారెడ్డి, ఎల్లంకి చంద్రయ్య, ఎర్ర పెద్ద యాదయ్య తదితరులు పాల్గొన్నారు.


# బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యుడిగా భోగ శ్రీనివాస్




**ప్రజాపక్షం/ఆలేరు :** భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యునిగా భోగ శ్రీనివాస్‌ను నియమిస్తూ శుక్రవారం భువనగిరి బిజెపి పార్టీ కార్యాలయంలో బిజెపి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ కార్యదర్శి మహేందర్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భోగ శ్రీనివాస్ తన నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్, ఆలేరు మండల అధ్యక్షులు పూజారి కుమారస్వామి, సీనియర్ నాయకులు ములుగు రాజు, బిజెపి నాయకులకు కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

# కాంట్రాక్టరూ.. ఇదేనా నీ పనితీరు?

**నేటికీ సుక్క నీళ్లు రాని మిషన్ భగీరథ నల్లా ఫిర్యాదు చేసినా పట్టించుకోని సంబంధిత ఏఈ త్రవ్వి చూడగా అసలు విషయం వెలుగులోకి**



**ప్రజాపక్షం/ శాలిగౌరారం:** గత రెండు సంవత్సరాల నుండి మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో నల్ల కనె క్షన్ ఉన్న ప్రాంతంలో త్రవ్వి చూడగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే నల్లగొండ జిల్లా, శాలిగౌరారం మండల పరిధిలోని మనిమద్దె గ్రామంలో పాఠశాలకు సమీపంలో ఉన్న కోటగిరి రమేష్ ఇంట్లోకి మిషన్ భగీరథ పైపులైన్లు వేసినప్పటి నుండి నేటి వరకు నీళ్లు రావట్లేదు.నీళ్లు రావట్లేదని అనేక మార్లు సంబంధిత కాంట్రాక్టర్ , ఏఈ కి చెప్పిన ప్పటికీ నేటికి దానిపైన సమాధానం చెప్పకుండా దాట వేస్తూనే ఉన్నారు. గురువారం నల్ల కనెక్షన్ ఇచ్చిన దగ్గర త్రవ్వి చూడగా అసలు విషయం బయటపడింది. మిషన్ భగీరథ మెయిన్ పైపు నుండి బాధితుని ఇంట్లోకి నీళ్ల పైపు వేశారు. కానీ నీళ్లు రాకుండా మధ్య లోనే కట్ చేసి మూతపెట్టి యథావిధిగా మట్టితో పూడ్చేశారు. దీనికి గల కారకులెవరు ?మిషన్ భగీరథ పనులను అదే గ్రామానికి చెందిన ఓంకార్ అనే వ్యక్తి మిషన్ భగీరథ నల్లా పనులను కాంట్రాక్టుకు తీసుకొని చేయించాడు.నేటికీ ఆ గ్రామంలో సగానికి పైగా ఇండ్లలో మిషన్ భగీరథ నల్ల కనెక్షన్ ఇవ్వలేదని , ఇచ్చిన కొన్ని కనెక్షన్లకు బిందెలు పెట్టడానికి దిమ్మలు కట్టించలేదని ఆరోపణలు ఉన్నాయి. పై విషయాలపై సంబంధిత ఉన్నతాధికారులు పూర్తి విచారణ చేసి నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్న బాధ్యుల పైన చర్యలు తీసుకోవాలని బాధితుడు కోటగిరి రమేష్ తెలిపారు.

## వాహనాలలో అధిక మొత్తంలో డబ్బులు తరలించొద్దు



**ప్రజాపక్షం / మునగాల:** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అనుమతులు లేకుండా వాహనాలలో ఎక్కువ మొత్తంలో డబ్బులు తరలించరాదని మునగాల ఎస్ఐ అంజిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బరాఖత్‌గూడెం గ్రామంలో నడిగూడెం మండలం నుండి వస్తున్న వాహనాలను తనిఖీ చేశారు. ఆయన వెంట చిలుకూరు ఎంపివో ఇబ్రహీం, హెడ్ కానిస్టేబుల్ జానిమీయా, పోలీసులు నిరంజన్, వీరభద్రారెడ్డి తదితరులున్నారు.

## భువనగిరి ఎంపీగా బూర నర్సయ్యగౌడ్ గెలుపు ఖాయం



**ప్రజాపక్షం / బొమ్మలరామారం :** భువనగిరి ఎంపీగా బిజెపి అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ గెలుపు ఖాయమని బిజెపి మండల ప్రధాన కార్యదర్శి చీర గణేష్ అన్నారు. మండలంలోని బిజెపి పార్టీ కార్యాలయంలో శుక్రవారం రోజున విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో ప్రతి ఒక్కరికి ఉచితంగా వ్యాక్సిన్ ఇచ్చి ప్రతి ఒక్క పేద ప్రజల ప్రాణాలు కాపాడిన వ్యక్తి ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి దక్కిన ఘనత అని పేద ప్రజల ఆకలి తీర్చడం కోసం ఉచితంగా రేషన్ బియ్యం పంపిణీ చేసిన నరేంద్ర మోడీకి ప్రజలు మరొకసారి 400 సీట్లతో మూడోసారి ప్రధాన మంత్రిగా చేయడం కోసం చూస్తున్నారని అందులో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం కూడా ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బూత్ అధ్యక్షులు భాస్కర్, కిసాన్ మోర్చా అధ్యక్షులు సంతోష్ రెడ్డి, మండల నాయకులు పరిద మహేష్, వినోద్, పరమేష్, సంతోష్, మల్లేష్, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

**ప్రజాపక్షం / కొండమల్లేపల్లి:** మైనింగ్ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఎం. రామ్మూర్తి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్ యజమానులను హెచ్చరించారు. విశ్వసనీయ సమాచారం మేరకు అనుమతి లేకుండా శుక్రవారం మధ్యాహ్నం కొండమల్లేపల్లిలోని హైదరాబాద్ రోడ్డులో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఒక ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేశారు.

## అన్ని గ్రామాల్లో ఐకెపి కేంద్రాలు ఏర్పాటు చేయాలి

**సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి**




**ప్రజాపక్షం / సూర్యాపేట:** యాసంగి ధాన్యం చేతికి వచ్చినందున అన్ని గ్రామాల్లో ఐకెపి కేంద్రాలు ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మల్లు వెంకటనరసింహారెడ్డి భవన్‌లో నిర్వహించిన సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గం సమావేశంలో ఆయన మాట్లాడుతూ యాసంగి వరి సీజన్ ప్రారంభమవుతున్న సందర్భంగా ప్రభుత్వం వెంటనే అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని కోరారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం మూలంగా రైతులు ధాన్యాన్ని మధ్య దళారులకు అమ్మాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. దీంతో గిట్టుబాట ధర లభించక రైతాంగం తీవ్రంగా నష్టపోతుందన్నారు. వర్షాభావంతో ఇప్పటికే సగం వరిచేలు ఎండిపోయాయి అన్నారు. ప్రభుత్వం తక్షణమే నిర్ణయించిన మద్దతు ధరల బ్యానర్ పెట్టాలని కోరారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన బోనస్ కూడా ఈ రబీలో ఇవ్వాలని కోరారు. జిల్లాలో అనేక గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే ప్రత్యేక సమావేశం నిర్వహించి తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న గ్రామాలలో అద్దె బోర్ల ద్వారా ప్రజలకు తాగు నీరు అందేవిధంగా చర్యలు చేపట్టాలని కోరారు. అదే విధంగా గ్రామాలలో ఉన్న చేతిపంపులను వెంటనే రిపేర్ చేయాలని కోరారు. దళితవాడలు, గిరిజన తండాలు అధికంగా ఉన్న గ్రామాలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు యుద్ధ ప్రతిపాదికన చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లాలో వేలాది ఎకరాలలో సాగు నీరు లేక పంటలు ఎండిపోతున్న పట్టించుకున్నా థుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండిపోయిన వరి పంటలకు ఎకరాకు రూ.25వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు కింద ఉన్న భూములు, ఎస్సారెస్పీ కాలువ పరిధిలో ఉన్న భూములకు సాగునీరు రాకపోవడంతో కేవలం బోరు,బావి మీద ఆధారపడి పంటలు వేశారని, భూగర్భజలాలు అడుగంటడంతో ఆ పంటలు కూడా తీవ్రంగా ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో తీవ్రకరువు పరిస్థితులు ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే కరువు మండలాలను ప్రకటించి రైతులను ఆదుకోవాలని కోరారు.కరువులో పేదలను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని గ్రామాలలో ఉపాధి హామీ పనులు ప్రారంభించి 200 రోజుల పనిదినాలు ఇవ్వాలన్నారు.పెరిగిన ధరలకు అనుగుణంగా రోజువారి కూలి రూ.600లు ఇవ్వాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, మట్టిపల్లి సైదులు, కోట గోపి పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలో పోషణ పక్షం..



**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బ్రాహ్మణపల్లి 1 అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ పక్షంలో భాగంగా సిడిపివో జ్యోత్స్న గర్భిణిలు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాల ప్రాముఖ్యత, గర్భిణిలు, బాలింతలు పోషక విలువలు గల ఆహారంను అలవాటు చేసుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణిలు, బాలింతలు ప్రభుత్వం అందించే పాలు, గుడ్లు, బాలామృతంలను సద్వినియోగం చేసుకోవాలని, పిల్లలకు పౌష్టికాహారం పొందాలని సూచించారు. గర్భిణిలు, బాలింతలు చిరుధాన్యాలను తీసుకోవడం ద్వారా తల్లి బిడ్డ పౌష్టికంగా వృద్ధి చెందుతారని, గర్భం దాల్చిన మహిళ ప్రసవం వరకు గోల్డెన్ డేస్‌గా పరిగణించి ఆకుకూరలు, పాలు, గుడ్లు, చిరుధాన్యాలు తీసుకోవాలని అన్నారు. సూపర్‌వైజర్ యాక్‌పాషాబేగం, వెంకన్న, మౌనిక, ఆయా వెంకటమ్మ, గర్భిణిలు, బాలింతలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## పెరిక కులానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల హర్షం



**ప్రజాపక్షం / గుండాల:** తెలంగాణ రాష్ట్రంలో పెరిక కులానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల పెరిక కుల సంఘం, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పెరిక సంఘం కుల సభ్య లు, కాంగ్రెస్ గ్రామశాఖ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు వుట్ల బిక్షం, మాజీ సర్పంచ్ బండారు వెంకటేష్, సుందరం, సుధాకర్, నరేష్, రమేష్, లింగయ్య, శ్రీధర్, సత్తయ్య, కిషన్ పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్‌లో పలు పదవుల కోసం ఈ నెల 28న ఎన్నికలు

**ప్రజాపక్షం / కోదాడ:** కోదాడ బార్ అసోసియేషన్‌లో పలు పదవుల కోసం ఈ నెల 28న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రధాన ఎన్నికల అధికారి వెజ్జేళ్ల రంగారావు, ఉప ఎన్నికల అధికారి షేక్ జానీపాషా,సహాయ ఎన్నికల అధికారి ఆవుల మల్లికార్జున్‌రావులు తెలిపారు.శుక్రవారం నామినేషన్ల ఉప సంహరణ గడువు ముగిసిన తరువాత ఏకగ్రీవంగా ఎన్నికైన వారి వివరాలు,పోటీలో ఉన్న వారి వివరాలను వారు ప్రకటించారు. అసోసియేషన్ అధ్యక్ష పదవికి ఎస్ఆర్‌కె మూర్తి, నాళం రాజయ్య పోటీ పడుతుండగా లైబ్రరీ కార్యదర్శిగా మందా వెంకటేశ్వర్లు,షేక్ కరీముల్లా, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా వేల్పుల మోష,పోలూరి హేమలత, 1వ కార్యవర్గ సభ్యులుగా దొడ్డ శ్రీధర్, మహ్మద్ హస్సేన్‌లో పోటీలో ఉన్నట్లు వారు తెలిపారు. కాగా ఉపాధ్యక్షులుగా గట్ల నర్సింహారావు, ప్రధాన కార్యదర్శిగా చింతకుంట్ల రామిరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా సరికొండ హనుమంతరాజు, కోశాధికారిగా కోడూరు వెంకటేశ్వరరావు, మహిళా ప్రతినిధిగా ఒరుగంటి ధనలక్ష్మి , 2వ కార్యవర్గసభ్యుడిగా సామా నవీన్‌కుమార్, 3వ కార్యవర్గ సభ్యుడిగా షేక్ నాగుల్ పాషాలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వారు తెలిపారు.కాగా పోటీలో ఉన్న పదవుల ఎన్నిక కోసం ఈ నెల 28న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ నిర్వహించి నంతరం 3 గంటల నుండి కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు వెల్లడించనున్నట్లు తెలిపారు.

## బహుజన వాదం కోసం కట్టుబడి ఉన్నా



**ప్రజాపక్షం / చిట్యాల:** ఎవరెన్ని ఆశలు పెట్టినా తలొగ్గేది లేదని, బహుజన వాదం కోసమే కట్టుబడి ఉన్నానని బిఎస్‌పి నకిరేకల్ ఇంఛార్జ్ మేడి ప్రియదర్శిని అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామంలోని తన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ పార్టీలలో నాయకులు అనేకులు వస్తుంటారు, పోతుంటారు కాని పార్టీ సిద్ధాంతాలను కాపాడుకునే వారు స్థిరంగా ఉంటారని అన్నారు. పార్టీలో ఉన్న నాయకులు, కార్యకర్తలు అధైర్య పడొద్దని బహుజన వాదంతో మనమంతా ముందుకు సాగుదామన్నారు. ప్రజా సమస్యలపై, బహుజనుల రక్షణకై మనమంతా పోరాడుదామని ప్రియదర్శిని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఉపాధ్యక్షులు పావిరాల నర్సింహ్మ, నాయకులు మునగోటి సత్తయ్య, చెరుకపల్లి శాంతికుమార్, జోగు శేఖర్, రాజు, నకిరేకంటి నర్సింహ్మ, గట్టు రమేష్, బందెల అనిత, బాలగోని మల్లయ్య, బుస్సు శ్రీకాంత్, రవి, యోగి, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తున్న మోడీ ప్రభుత్వం



**ప్రజాపక్షం / నల్లగొండ టౌన్ :** దేశంలో ప్రజాస్వామ్యానికి ప్రజాస్వామ్య వ్యవస్థకు మోడీ ప్రభుత్వం తూట్లు పొడుస్తున్నదని అందుకు నిదర్శనమే కాంగ్రెస్ పార్టీ. యువజన కాంగ్రెస్ ఎన్ఎస్‌యుఐ ఖాతాలను కేంద్ర ప్రభుత్వం ఫ్రీజ్ చేసిందని అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీ నిర్మించినటువంటి నిర్మాణ సంస్థలు అన్నిటిని కూడా అమ్ముకుంటూ దేశాన్ని అధోగతి పట్టిస్తున్నటువంటి ఈ బిజెపి ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని యువజన కాంగ్రెస్ నల్లగొండ జిల్లా అధ్యక్షులు గౌని రాజా రమేష్ యాదవ్ అన్నారు. యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు బివి శ్రీనివాస్ , రాష్ట్ర అధ్యక్షుడు శివసేన రెడ్డి పిలుపు మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలో మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కొరెడ్డి జయంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట రాకేష్, నల్లగొండ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్ కె జహంగీర్, మిర్యాలగూడ అధ్యక్షుడు అజార్, పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజు, నల్లగొండ మండల అధ్యక్షుడు నవీన్, కనగల్ మండల అధ్యక్షులు రాజిరెడ్డి, సంగం కీర్తి, సిద్ధార్థ, అజారుద్దీన్, ముజ్జు, బిలాల్, నరేష్, ఇర్ఫాన్, అరుణ్, వెంకన్న పాల్గొన్నారు.

# తమ గ్రామస్తులకే ఆసుపత్రిలో ఉద్యోగాలు...

## లంచాలు తీసుకుని ఇచ్చారంటూ ఆందోళన



**ప్రజాపక్షం / సూర్యాపేట:** ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సూపరిండెంట్ డాక్టర్ దండా మురళిధర్‌రెడ్డి తన గ్రామానికి చెందిన వారికి డబ్బులు తీసుకుని అక్రమంగా ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపిస్తూ శుక్రవారం జిల్లా ఆసుపత్రి ముందు కొంతమంది ఆయన చేతిలో మోసపోయిన బాధితులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అండదండలతో ఆసుపత్రిలో సూపరిండెంట్‌గా పనిచేస్తూ ప్రజా ధనాన్ని దోచుకున్నారని ఆరోపించారు. ఆసుపత్రి మెడికల్ కళాశాలలో అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలను తన కటుంబ సభ్యులకు, బంధువులకు ఇప్పించి లక్షల్లో దోచుకున్నాడని అన్నారు. అవినీతి జలగను ఆదాయపన్ను వారు పట్టుకునేందుకు ఇటీవల అనేకమార్లు వచ్చినా తప్పించుకున్నాడని పేర్కొన్నారు. ఇలాంటి అవినీతి పరుడు ఇతర ప్రాంతానికి బదిలీ అయితేనే రాజకీయ జోక్యతోనే బదిలీ అయ్యాడంటూ కొంతమందిని ఉసిగోలిపి ఆందోళన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. బదిలీ సక్రమమేనని దీంతోజిల్లా ఆసుపత్రికి పట్టిన అవినీతి మచ్చ తొలగిందన్నారు. తన గ్రామస్తులను అనుచరులుగా మార్చుకుని తనకు అనుకూలంగా ధర్నాలు చేయించుకోవడం సిగ్గుచోటన్నారు. అవినీతి పరుడైన మురళిధర్‌రెడ్డిని బదిలీ చేయడం కాదని ఏకంగా సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## కెరీర్‌ను ఎంచుకుని ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి

**ప్రజాపక్షం / నడిగూడెం:** విద్యార్థులు ముందుగా తమ కెరీర్‌ను ఎంచుకుని తదనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని యం.యస్ విద్యాసంస్థల సీఈవో ఎస్.ఎస్.రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థినులకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. పిల్లలపై తల్లిదండ్రులు ఎలాంటి ఒత్తిడి చేయకుండా వారి అభిప్రాయాలకు అనుగుణంగా సలహాలు,సూచనలు చేసి వారి కెరీర్‌కు తోడ్పాటు అందించాలని, వారికి ఇష్టమైన కోర్సు తీసుకుని అందులో పరిపూర్ణమైన జ్ఞానాన్ని పొంది మంచి కెరీర్‌ను సాధించుకోవచ్చన్నారు. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, బ్యాంకింగ్, రైల్వే, ఇంజనీరింగ్, మెడికల్, సాఫ్ట్‌వేర్, రవాణా, ఫార్మారంగాలలో మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థినుల చేత కెరీర్ గైడెన్స్‌కు సంబంధించిన సూచనలను యస్.యస్.రావు ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ధనవిజయ లక్ష్మీ ,అధ్యాపకులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు రవికృష్ణ, రజిని, మూర్తి, విద్యార్థినులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలో పోషన పకోత్సవాలు



**ప్రజాపక్షం / నాంపల్లి:** నాంపల్లి మండల పరిధిలోని ఫకీర్‌పురం, పెద్దాపురం, తుమ్మల పల్లి గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలలో శుక్రవారం పోషణ పకోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులకు పోషకాహారం, ఐవైసిఎఫ్ పద్దతులు, చిరుధాన్యాల ప్రాముఖ్యత గురించి, ప్లాస్టిక్ నిషేదం, ఇంకుడు గుంతల ఏర్పాటు, మరుగుదొడ్ల ఉపయోగించడం మొదలగు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రాంతీయ వంటల ఉపయోగాలను వివరించారు. ప్రీస్కూల్ ప్రాముఖ్యత, బయటి ఆటలు, లోపటి ఆటల వలన సూక్ష్మ కండరాలు, స్థూల కండరాల అభివృద్ధి చెందడం మరయు మేధోశక్తి పెరగడం వంటి వాటిని అంగన్‌వాడీ స్కూల్‌లలోనే సాధ్యం అవుతుందని వివరించారు. పిల్లలకు పౌష్టికాహారం అందించడం పై తల్లులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. అనంతరం పిల్లలకు అక్షరాభ్యాస నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మీ, శశికళ, పల్లె దవఖానా డా. కళ్యాణి, సంతోష, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు కల్లాల స్వర్ణ, పద్మ, కవిత, మమత, లక్ష్మమ్మ, అకునూరి నాగలక్ష్మీ, అనుదీప్, ప్రసన్నబాబు, అషా, అనిత, ఆయాలు యశోద, ఈదమ్మ, సుశీల, గ్రామ పెద్దలు, గర్భిణిల్లు, బాలింతలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## మురళీధర్‌రెడ్డి బదిలీ నిరసిస్తూ ప్రభుత్వాసుపత్రి ఎదుట ధర్నా




**ప్రజాపక్షం / సూర్యాపేట టౌన్:** ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ మురళిధర్‌రెడ్డి బదిలీని నిరసిస్తూ శుక్రవరం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎదుట కొంతమంది ఆసుపత్రి సిబ్బంది ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బదిలీలో రాజకీయ జోక్యంతోనే డాక్టర్ మురళిధర్‌రెడ్డిని బదిలీ చేశారని ఆరోపించారు. డాక్టర్ ఆయన భార్య ప్రైవేట్ ఆసుపత్రిలో లక్షలు సంపాదించే అవకాశం ఉన్నా సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోనే పేదలకు సేవలు అందిచారని అన్నారు. కొందరు రాజకీయ నిరుద్యోగులు వైద్య వృత్తిని కలుషితం చేస్తున్నారని, అర్ధరాత్రి, అపరాత్రి లేకుండా రోగులకు సేవలంధించిన ఘనత డాక్టర్ మురళిధర్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. మెడికల్ కళాశాలకు భూముల సేకరణలో మురళిధర్‌రెడ్డి ప్రధాన పాత్ర పోషించాడని, ఆయన లేకుంటే మెడికల్ కళాశాల పూర్తయ్యేది కాదన్నారు. ఆయనను బదిలీ నిలిపివేసి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## విగ్రహాన్ని దొంగిలించిన దుండగులను అరెస్టు చేయాలి



**ప్రజాపక్షం/మర్రిగూడః** హైదరాబాద్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలోని జ్యోతి నగర్, దోబీ ఘాడ్ దగ్గర చాకలి ఐలమ్మ విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసి ఐలమ్మ విగ్రహాన్ని దొంగలించడం చాలా హేయమైన చర్య అని నల్లగొండ రజక సంఘం నాయకులు వెంకటంపేట బాలయ్య అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వీర తెలంగాణ పోరాటంలో క్రియాశీల ఉద్యమాన్ని నిర్వహించిన వీర వనిత తెలంగాణ తల్లిగా గుర్తించబడ్డ చాకలి ఐలమ్మ విగ్రహాన్ని దొంగలించిన దుండగులను తక్షణమే అరెస్టు చేసి ఐలమ్మ విగ్రహాన్ని పునర్నిర్మాణం జరిపించాలని కోరారు. లేనియెడల అన్ని రజక సంఘాలను కలుపుకొని తెలంగాణ రజక సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో జిల్లాల మండలాల రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మర్రిగూడ మండల రజక సంఘం నాయకులు పగడాల పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశ్నించే గొంతుకను పార్లమెంట్‌కు పంపండి

### మార్చి 26న భువనగిరి పార్లమెంటు స్థాయి కార్యకర్తలు సమావేశం

### ఎం.డి జహంగీర్, సిపిఎం ఎంపి అభ్యర్థి




**ప్రజాపక్షం / చౌటుప్పల్:** ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకనే ఎంపీగా పంపించాలని సిపిఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండి జహంగీర్ కోరారు. అనునిత్యం ప్రజల్లో ఉంటూ, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న కమ్యూనిస్టులను పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు గెలిపించాలని అన్నారు. చౌటుప్పల్ లోని కందాల రంగారెడ్డి స్మారక భవన్ లో శుక్రవారం ముఖ్య కార్యకర్తలు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం లోని ఆలేరు, భువనగిరి, తుంగతుర్తి, నకిరేకల్, మునుగోడు, జనగాం, ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గాల్లో సిపిఎం బలంగా ఉందని చెప్పారు. గతంలో ఆయా నియోజకవర్గాల్లో కమ్యూనిస్టులు గెలిచిన చరిత్ర ఉందని గుర్తు చేశారు. దేశంలో ఫాసిస్టు పాలన కొనసాగిస్తున్న బిజెపి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు.భువనగిరి నియోజకవర్గం లో ఎంపీగా సిపిఎం పోటీ చేస్తున్న సందర్భంగా ఈనెల 26న భువనగిరి పట్టణ కేంద్రంలో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి సిపిఎం పోలిటీ బ్యూరో సభ్యులు బివి రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్. వీరయ్య, జూలకంటి రంగారెడ్డి , మల్లు లక్ష్మి పాల్గొంటారని చెప్పారు. కార్యకర్తలు ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో చౌటుప్పల్ మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా, బూరుగు కృష్ణారెడ్డి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేశం, నాయకులు గోశిక స్వామి, అవ్వారు గోవర్ధన్, బద్దం అంజయ్య, శ్రీనివాసరెడ్డి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## పంటల ప్రణాళికపై జాగ్రత్త చర్యలపై దృష్టి పెట్టాలి

**ప్రజాపక్షం / నల్లగొండ:** మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా పంటల ప్రణాళిక, తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యల పైన దృష్టి పెట్టవలసిన అవసరం ఎంతైనా ఉందని పరిశోధన సంచాలకులు డా పి రఘురామిరెడ్డి అన్నారు. ప్రొపెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం , నల్లగొండ జిల్లా వ్యవసాయ శాఖ వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దక్షిణ తెలంగాణ పంటల పరిశోధన, విస్తరణ సలహా సంఘ సమావేశం 202425 రెండవ రోజు కార్యక్రమంలో భాగంగా పరిశోధన సంచాలకులు ఆయన పాల్గొని మాట్లాడుతూ జిల్లాల వారిగా ఆత్మోల పంటలు ప్రణాళికలను మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా సూచించడం జరిగిందని, అదేవిధంగా ఆపత్కాల పరిస్థితుల్లో వివిధ పంటలలో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను వివరించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా ప్రపంచ నేటి దినోత్సవాన్ని పురస్కరించుకొని వ్యవసాయ విశ్వ విద్యాలయం విస్తరణ సంచాలకులు డా.వి సుధారాణి, వాటర్ ఫర్ పేస్ వీడియోని ఆవిష్కరించారు. డా కె అవిల్ కుమార్ వ్యవసాయంలో నేటి ప్రాముఖ్యతను నేటి సంరక్షణ అవసరాన్ని వివరించారు. రెండు రోజులుగా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్న రైతులు, శాస్త్రవేలు, వ్యవసాయ అధికారులను పదకొండు గ్రూపులుగా విభజించి దక్షిణ తెలంగాణ మండల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అంశాల వారిగా గురించి రాబోయే సంవత్సర కాలంలో పరిశోధన, విస్తరణ విభాగాలలో పొందుపరచడాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో దక్షిణ తెలంగాణ మండల సహ పరిశోధన సంచాలకులు డా. ఎం మల్లారెడ్డి, వివిధ పంటలు, విభాగాల ప్రధాన ప్రోగ్రాం కో ఆర్డినేటర్లు, శాస్త్రవేత్తలు, తదితరులు పాల్గొన్నారు.అనంతరం వివిధ పంటలలో ఆధునీక సాంకేతిక పరిజ్ఞాన్ని వినియోగించుకొని విజయవంతంగా ఎదిగిన రైతులను సన్మానించారు.

## బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలు

**ప్రజాపక్షం / భూదాన్ పోచంపల్లి:** మండలంలోని వివిధ గ్రామాల బిఆర్ఎస్ ముఖ్య నాయకులు శుక్రవారం భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్ నుండి బిఆర్ఎస్ పార్టీని వీడి 45 మంది కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. పార్టీ లో చేరిన వారలో కొండమడుగు ఎల్లస్వామి, పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్, కొండమడుగు మల్లేష్, దేవిగారి ధనుంజయ, కొండమడుగు భాస్కర్, మీసాల శ్రీనివాస్, కొండమడుగు నరేందర్, కొండమడుగు ఇస్తారి, కొండమడుగు చంద్రయ్య, రామచంద్రం, రాజయ్య, మల్లయ్య, బాలయ్య, రమేష్, లక్ష్మయ్య, కొండమడుగు నరసింహ ఉన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి బండారు ప్రకాష్ రెడ్డి, ఒకటవ వార్డ్ కౌన్సిలర్ దారెడ్డి వేణుగోపాల్ రెడ్డి, ఒకటో వార్డ్ అధ్యక్షులు నార్లకంటి రాంరెడ్డి, రెండో వార్డ్ అధ్యక్షులు ఇటముని మహేష్, కోర్ కమిటీ మెంబర్ సప్పిడి చంద్రశేఖర్ రెడ్డి, ఇటమోని నరేందర్,సన్న నరసింహ యాదవ్, మునుకుంట్ల లక్ష్మణ్, గుండ్ల నవీన్, ఇటమోని నరసింహ, శ్రీరామ్ పాండు, కొండమడుగు శ్రీకాంత్, బండారు శేఖర్ రెడ్డి, బాల్ రెడ్డి, గోదాసు శ్రీశైలం, వినోద్ రెడ్డి, చంద్రయ్య, జంగారెడ్డి పాల్గొన్నారు.

## కరపత్రాల ఆవిష్కరణ

**ప్రజాపక్షం / చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయ 21వ వార్షిక మహోత్సవం ఈ నెల 26న జరుగనుంది. వార్సికోత్సవ కరపత్రాలను శుక్రవారం రోజున ఆలయ కార్యవర్గం ఆవిష్కరించింది. ఉత్సవ కార్యక్రమ వివరాలను కరపత్రంలో పొందుపరిచారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మారగోని ఆంజనేయులు, ఆలయ అధికారి అంబటి నాగిరెడ్డి, కార్యవర్గ సభ్యులు బుద్ధ విమల, గంజి వెంకటస్త్రశం, వరకాంతం నర్సింహ్మారెడ్డి, రుద్రారపు లింగయ్య, జిట్ట సాయిలు, వనమా నిఖిల్ కుమార్, ఆలయ అర్చకులు వినయ్‌కుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## బిజెవైఎం మండల అధ్యక్షుడిగా పబ్బు వంశీ గౌడ్

**ప్రజాపక్షం / చౌటుప్పల్:** చౌటుప్పల్ బీజేవైఎం మండల అధ్యక్షుడిగా నేలపట్ల గ్రామానికి చెందిన పబ్బు వంశీ గౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చౌటుప్పల్ మండలంలో యువత ఎదుర్కొంటున్న సమస్యలపై పని చేస్తానని తెలిపారు. దేశంలో మోడీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలను ప్రజల వద్దకు చేరవేసేలా యువత పనిచేయాలని కోరారు.